పల్లెలకు ప్రత్యేక అధికారులు .. 252 క్లస్టర్లలో బాధ్యతల స్వీకరణ

ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి అర్బన్, ఫిబ్రవరి 2 : గ్రామ పంచాయతీ పాలక వర్గాల పదవీ కాలం ఫిబ్రవరి 1వ తేదీతో ముగిసింది. ఇప్పట్లో ఎన్నికలు నిర్వహించేందుకు అవకాశం లేకపోవడంతో పంచాయతీల్లో ప్రత్యేక అధికారులను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ప్రత్యేకాధికారులు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. జిల్లాలో 558 గ్రామ పంచాయతీలు ఉండగా 252 క్లస్టర్లుగా విభజించారు. ఒక్కో క్లస్టర్ పరిధిలో రెండు నుంచి మూడు గ్రామాలున్నాయి. గెజిటెడ్ ఉద్యోగులను ఒక్కో క్లస్టర్‌కు ఒకరి చొప్పున జిల్లాలో 252 క్లస్టర్స్‌లో ప్రత్యేకాధికారులను నియమించారు.

చర్లపల్లి 'టర్మినల్' పనులకు రూ. 139.75 కోట్లు

చర్లపల్లి రైల్వే టర్మినల్ అభివృద్ధి పనులను మరింత ముమ్మరం చేయాలని దక్షిణమధ్య రైల్వే నిర్ణయించింది. ఈ ఆర్థిక సంవత్సరం చివరిలోపు పనులు పూర్తి చేయాలని నిర్ధేశించుకున్న రైల్వే శాఖ మధ్యంతర బడ్జెట్‌లో రూ.139.75 కోట్లు కేటాయించింది. టర్మినల్ అభివృద్ధికి రూ.47 కోట్లు, సోలార్ పవర్ పనులకు రూ. 93.75 కోట్లు కేటాయించింది. సికింద్రాబాద్, హైదరాబాద్ (నాంపల్లి), కాచిగూడ రైల్వే స్టేషన్లపై ప్రయాణికుల ఒత్తిడి తగ్గించడంతో పాటు ట్రాఫిక్ నియంత్రణ కోసం రూ.218కోట్ల అంచనా వ్యయంతో ఈ టర్మినల్‌ను అభివృద్ధి పరుస్తున్నారు. ఈ ప్రధాన రైల్వే స్టేషన్ల నుంచి రాకపోకలు సాగించే పలు దూర ప్రాంతాల రైళ్ల రాకపోకలను చర్లపల్లి నుంచి కొనసాగించేలా రైల్వే అధికారులు ప్రయత్నాలు చేస్తున్నారు. దీనికోసం చర్లపల్లి టర్మినల్‌ను అభివృద్ధి చేస్తున్నారు. దీనిలో భాగంగా రెండేళ్ల క్రితమే ఎనిమిది ట్రాక్‌ల ఏర్పాటు, ఆరు ప్లాట్‌ఫాంల విస్తరణ, చర్లపల్లి రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనులు పూర్తయ్యాయి. రైలు ఇంజన్ దిశను మార్చేలా ప్రత్యేక ఏర్పాటు, మరమ్మతుల షెడ్ నిర్మాణ పనులు కూడా పూర్తి చేశారు. ప్రయాణికుల సౌకర్యార్థం ఫుట్ ఓవర్ బ్రిడ్జిలు, ప్లాట్‌ఫాంలపై పైకప్పు నిర్మాణ పనులు, మల్లాపూర్ గోకుల్ నగర్‌కాలనీ వైపు ప్రధాన ద్వారం ఏర్పాటు పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. విద్యుత్, మంచినీటి సరఫరా, మరుగుదొడ్ల నిర్మాణం, డ్రైనేజీ వ్యవస్థకు సంబంధించిన పనులు చేపట్టాల్సి ఉంది.



చర్లపల్లి వైపు వచ్చే పాత ప్లాట్‌ఫాం

కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన మధ్యంతర బడ్జెట్‌లో రైల్వే పరంగా జిల్లాకు ఈ సారి కూడా నిరాశే ఎదురైంది. ఈ బడ్జెట్‌లో ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలోని వికారాబాద్ జిల్లా మీదుగా ఓ బైపాస్ రైల్వే లైన్ మినహా ఇతర కొత్త రైల్వేలైన్లు, కొత్త రైళ్ల ఊసు లేకపోవడం జిల్లా ప్రజలకు తీవ్ర నిరాశకు గురిచేస్తోంది. ఎంతో కాలంగా ఊరిస్తూ వస్తున్న ఎంఎంటీఎస్ సేవల పొడిగింపు ప్రస్తావన కూడా లేకపోవడం గమనార్హం.

- కలగా మారిన ఎంఎంటీఎస్ సేవల పొడిగింపు
- కొత్త రైల్వే లైన్లు, కొత్త రైళ్ల ఊసులేని బడ్జెట్
- ప్రస్తావన లేని హైదరాబాద్ - ముంబై హైస్పీడ్ రైల్ ప్రాజెక్టు



నో.. చుక్ చుక్!

మూడున్నర దశాబ్దాలైనా..

కొత్తరైల్వే ప్రాజెక్టులకు ఈసారీ కలగని మోక్షం

వికారాబాద్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఈ సారైనా కేంద్ర బడ్జెట్‌లో వికారాబాద్ వరకైనా ఎంఎంటీఎస్ ప్రతిపాదన వస్తుందని ఆశించిన ప్రజలకు మరోసారి నిరాశే ఎదురైంది. తమకు ఎంఎంటీఎస్ సదుపాయం కల్పించాలంటూ 15 ఏళ్లుగా వికారాబాద్ ప్రాంత ప్రజలు డిమాండ్ చేస్తూనే ఉన్నా ప్రజల ఆకాంక్షను కేంద్ర ప్రభుత్వం, రైల్వే మంత్రిత్వ శాఖ పరిగణనలోకి తీసుకోకపోవడం గమనార్హం. చాలా కాలంగా లింగంపల్లి నుంచి వికారాబాద్, తాండూరు వరకు ఎంఎంటీఎస్ పొడిగించాలని ఆ ప్రాంతాల ప్రజలు డిమాండ్ చేస్తూనే ఉన్నారు. కేంద్ర, రాష్ట్ర మంత్రులు, ఎంపీ, రైల్వే ఉన్నతాధికారులకు వినతి పత్రాలు ఇస్తూనే ఉన్నా ఈసారి కూడా మొండిచెయ్యి ఎదురైంది. ఇదిలా ఉంటే, హైదరాబాద్ నుంచి ముంబై వరకు శరవేగంగా రాకపోకలు కొనసాగించేందుకు నేషనల్ హైస్పీడ్ రైల్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఎన్‌హెచ్‌ఎస్‌ఆర్‌సీఎల్) ప్రతిపాదించిన ముంబై- హైదరాబాద్ హైస్పీడ్ రైల్ ప్రాజెక్టుకు కూడా మళ్లీ కేంద్ర ప్రభుత్వం ఎలాంటి నిధులూ కేటాయించలేదు. హైస్పీడ్ రైల్ ప్రాజెక్టు కార్యరూపం దాల్చేందుకు వీలుగా ఇప్పటికే పర్యావరణ, సామాజిక అనుమతులు పొందడానికి ప్రజాభిప్రాయ సేకరణ పూర్తి చేశారు. హైస్పీడ్ రైల్ కారిడార్ నిర్మాణానికి సంబంధించిన అలైన్‌మెంట్ పనులు చేపట్టాల్సి ఉంది. కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో హైస్పీడ్ రైల్ ప్రాజెక్టుకు నిధులు కేటాయించి ఉంటే పనులు ముందుకు సాగే అవకాశం ఉండేది. గురువారం కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన తాత్కాలిక బడ్జెట్‌లో హైస్పీడ్ రైల్ కారిడార్ నిర్మాణం అంశం లేకపోవడంతో ఈ ప్రాజెక్టు పురోగతిపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి. లక్ష కోట్ల రూపాయల వ్యయంతో ప్రభుత్వ, ప్రైవేట్ భాగస్వామ్యంతో ప్రతిపాదించిన హైస్పీడ్ రైల్ ప్రాజెక్టు అంశం బడ్జెట్‌లో లేకపోవడం గమనార్హం. ఈసారి కేంద్ర ప్రభుత్వం తన బడ్జెట్‌లో వికారాబాద్, తాండూరు మీదుగా కొత్తగా రైళ్లు నడిపించేందుకు గ్రీన్ సిగ్నల్ ఇస్తుందని ఆశించిన ప్రజలకు నిరాశే ఎదురైంది. ప్రజల డిమాండ్‌కు అనుగుణంగా కొత్త రైళ్లు ప్రవేశ పెట్టడంతో పాటు ప్రస్తుతం కొనసాగుతున్న రైళ్లకు అదనంగా బోగీలు వేయాలని ఆశించిన ప్రజలకు చివరకు మొండి చెయ్యి ఎదురైంది.

బైపాస్ లైన్ నిర్మాణానికి రూ.51 కోట్లు

కేంద్ర ప్రభుత్వం గురువారం ప్రవేశ పెట్టిన మధ్యంతర బడ్జెట్‌లో వికారాబాద్ మార్గంలో బైపాస్ లైన్ నిర్మాణానికి నిధులు కేటాయించింది. వికారాబాద్ పరిధిలో 2.8 కిలోమీటర్ల దూరం బైపాస్ లైన్ నిర్మాణం చేపట్టనున్నారు. ఈ పనులకు రూ.51 కోట్ల మేర ఖర్చు చేయనున్నారు. జిల్లాలోని ప్రధాన ప్రాజెక్టులకు మొండిచేయి చూపిన కేంద్ర ప్రభుత్వం ఈ బైపాస్ లైన్‌కు మాత్రం రూ.51 కోట్లు కేటాయించి చేతులు దులుపుకుంది. జిల్లా రైల్వే ప్రాజెక్టుల్లో ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది కేవలం దీనికి మాత్రమే.

ఎంతో కాలంగా ఊరిస్తూ వచ్చిన వికారాబాద్- కృష్ణ రైల్వే లైన్ నిర్మాణానికి రూ.2,196 కోట్లు ఖర్చవుతాయని పేర్కొన్న రైల్వే మంత్రిత్వ శాఖ ఈసారి కూడా బడ్జెట్‌లో నిధులు కేటాయించలేదు. వికారాబాద్ - కృష్ణ రైల్వే లైన్ కోసం మూడున్నర దశాబ్దాలుగా ప్రజలు ఎదురు చూస్తుండగా, గత అయిదు నెలల కిందట ఫైనల్ లొకేషన్ సర్వే పనులు చేపట్టేందుకు రైల్వే శాఖ అనుమతించిన విషయం తెలిసిందే. ఈ మార్గం పూర్తయితే వికారాబాద్ జిల్లా పరిగి, కొడంగల్, హస్నాబాద్, దౌల్తాబాద్, నారాయణపేట జిల్లా మక్తల్, నారాయణపేట్ మీదుగా సుమారు 40 ప్రాంతాలకు రైలు ప్రయాణం సదుపాయం కలగనుంది. వికారాబాద్ - కృష్ణ రైల్వే లైన్ పనులు వేగంగా కొనసాగేలా చర్యలు తీసుకోవాలని ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్‌ను కోరిన విషయం తెలిసిందే.



కేట్ కట్ చేస్తున్న కలెక్టర్ శశాంక

కలెక్టరేట్‌లో ఘనంగా ఈజీఎస్ దినోత్సవం

- కేక్ కట్‌చేసిన జిల్లా కలెక్టర్ శశాంక

రంగారెడ్డి అర్బన్, ఫిబ్రవరి 2 : మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం 18వ ఆవిర్భావ దినోత్సవాన్ని జిల్లా కలెక్టరేట్‌లో శుక్రవారం ఉపాధిహామీ సిబ్బంది ఘనంగా నిర్వహించారు. జిల్లా కలెక్టర్ శశాంక కేక్ కట్‌చేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కలెక్టర్ శశాంక మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో జాబ్ కార్డు కలిగిన ప్రతీ కుటుంబానికి ఉపాధిహామీ పథకం కింద వంద రోజుల పని కల్పించాలని సూచించారు. ఈ ఆవిర్భావ వేడుకల్లో జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్, ఉపాధిహామీ అధికారి నీరజ, ఏపీవో నాగభూషణం, డీఆర్‌డీవో సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధిహామీ పథకం వచ్చాక వలసలు తగ్గాయి

- డీఆర్‌డీవో ప్రభాకర్

ఇబ్రహీంపట్నం, ఫిబ్రవరి 2 : మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం (ఎన్‌ఆర్‌ఈజీఎస్) అమలులోకి వచ్చాక గ్రామీణ ప్రాంతాల్లో వలసలు తగ్గాయని జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి ప్రభాకర్ అన్నారు. చట్టం పార్లమెంట్‌లో ఆమోదం పొందిన రోజు (ఫిబ్రవరి 2)ను పురస్కరించుకొని శుక్రవారం మండల పరిధి రాయపోల్ గ్రామంలో ఆయన ఉపాధి కూలీలతో కలిసి కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన కూలీలకు ఈ పథకంపై అవగాహన కల్పించారు. ఈ చట్టం ద్వారా కూలీలకు పని కల్పించమని కోరే హక్కు ఉందని, అడిగిన వెంటనే కల్పించడం జరుగుతుందన్నారు. చెరువులు, కుంటల్లో పూడిక తీత, కట్టల నిర్మాణం, ఫాం పాండ్స్ నిర్మాణంతో నీటిని నిల్వ చేసుకుని సాగు విస్తీర్ణాన్ని పెంచుకున్నామని గుర్తు చేశారు. డీఆర్డీఏ ఏపీడీ సక్రియానాయక్, ఏపీవో తిరుపతాచారి, ఈసీ రవికుమార్, ఫీల్డ్ అసిస్టెంట్ యాదగిరి తదితరులున్నారు.



రాయపోల్ గ్రామంలో కూలీలతో కలిసి కేక్ కట్ చేస్తున్న డీఆర్‌డీవో ప్రభాకర్

సీఎస్ రంగరాజన్‌కు
టీటీడీ ఆహ్వానం

మొయినాబాద్ రూరల్, ఫిబ్రవరి 2 : టీటీడీ సారథ్యంలో తిరుపతిలో ఈ నెల 3 నుంచి 5 వరకు నిర్వహించనున్న భక్తి ఉద్యమానికి ఆధ్యాత్మికగురు కేటగిరిలో చిలుకూరు శ్రీచిలుకూరు వెంకటేశ్వస్వామి ఆలయ ప్రధానార్చకుడు రంగరాజన్‌కు శుక్రవారం ఆహ్వానం అందినట్లు ఆయన ఓ ప్రకటనలో తెలిపారు. టీటీడీ వారు దేశవ్యాప్తంగా ఉన్న వివిధ పీఠాధిపతులను ఆహ్వానిస్తున్నట్లు, అందులో భాగంగా తనకు కూడా ఆహ్వానం అందినట్లు చెప్పారు. మూడు రోజుల పాటు జరిగే ఈ సనాతన ధార్మిక సదస్సులో పాల్గొనే అవకాశం వచ్చినందుకు సంతోషంగా ఉందని, సనాతన హిందూ ధర్మ విలువలను నిలబెట్టేందుకోసం చర్చిస్తానని చెప్పారు. దేశవ్యాప్తంగా 57 మంది పాల్గొంటారని పేర్కొన్నారు. 4వ తేదీన తిరుపతిలో పాల్గొని తన అభిప్రాయన్ని తెలపనున్నట్లు చెప్పారు.

జిల్లాకు 428మంది
నర్సుల కేటాయింపు

- జిల్లా వైద్యాధికారి వెంకటేశ్వరరావు, జిల్లా వైద్యావిధాన పరిషత్ వైద్యాధికారి రాజుయాదవ్
- చేవెళ్ల ప్రభుత్వ ఆసుపత్రిని తనిఖీ చేసిన జిల్లా వైద్యాధికారులు



ఆసుపత్రిలో మాట్లాడుతున్న వైద్యాధికారులు

చేవెళ్ల, ఫిబ్రవరి 2 : రాష్ట్ర ప్రభుత్వం జిల్లాకు 428 మంది నర్సులను కేటాయించిందని, వారం రోజుల్లోగా వారు విధుల్లో చేరేలా పక్రియ పూర్తి చేస్తామని జిల్లా వైద్యాధికారి వెంకటేశ్వరరావు, జిల్లా వైద్యావిధాన పరిషత్ వైద్యాధికారి రాజుయాదవ్ స్పష్టం చేశారు. శుక్రవారం వారు చేవెళ్ల ప్రభుత్వ సివిల్ ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో నెలకొన్న సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం వారు విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల కొత్తగా ఎంపిక చేసిన నర్సుల పోస్టుల నియమాకాల్లో రాష్ట్రంలోనే అత్యధికంగా రంగారెడ్డి జిల్లాలకు కేటాయించిందన్నారు. ఎంపిక చేసిన వారిని జిల్లాలోని వైద్యావిధాన పరిషత్ ఆసుపత్రికి 55 మంది నర్సులతోపాటు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు కేటాయించిందన్నారు. దీంతో పాటు ప్రభుత్వం ప్రత్యేకంగా కేటాయించిన ప్రభుత్వ గురుకుల పాఠశాలలైన మహాత్మాజ్యోతిరావు పూలే గురుకుల పాఠశాలలకు 18 మంది, ఎస్సీ గురుకులాలకు ఇద్దరు, మైనార్టీ గురుకుల పాఠశాలలకు 11 మంది, ఎస్టీ గురుకుల పాఠశాలకు 13 మంది, ఎంఎన్‌జీ క్యాన్సర్ ఆసుప్రతులకు 14 మందికి పోస్టింగులు ఇచ్చారన్నారు. ఆసుప్రతిలో రోగులకు సక్రమంగా వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు. విధుల పట్ల నిర్లక్షం వహిస్తే శాఖపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆసుప్రతిలో రక్త పరీక్షల కోసం సీటీటీ పరీక్ష కేంద్రాన్ని అందుబాటులోకి తీసుకువస్తామని చెప్పారు. కార్యక్రమంలో చేవెళ్ల డిప్యూటీ డీఎంహెచ్‌వో దామోదర్, వైద్యులు సోమశేఖర్, లక్ష్మీకాంత్‌రెడ్డి, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



ఎరువుల దుకాణంలో రికార్డులు పరిశీలిస్తున్న గీతారెడ్డి

నకిలీ విత్తనాలు అమ్మితే చర్యలు తప్పవు

శంకర్‌పల్లి, ఫిబ్రవరి 2 : రైతులకు నకిలీ విత్తనాలు, ఎరువులు అమ్మితే చట్టపరమైన చర్యలు తప్పవని జిల్లా వ్యవసాయ అధికారి గీతారెడ్డి స్పష్టం చేశారు. శుక్రవారం శంకర్‌పల్లి మండల పరిధిలోని వివిధ ఎరువుల దుకాణాల్లో ఆమె ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు ఎరువుల దుకాణాల్లో రికార్డులు పరిశీలిస్తున్నామన్నారు. ఈపాస్ ద్వారా అమ్మకాలు జరపాలని సూచించారు. ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తనిఖీల్లో మండల వ్యవసాయ అధికారి సురేశ్ బాబు తదితరులు పాల్గొన్నారు.

మంచాల పీఏసీఎస్ చైర్మన్ సస్పెన్షన్

- తాత్కాలిక చైర్మన్‌గా బొద్రమోని యాదయ్య



మంచాల, ఫిబ్రవరి 2 : మంచాల వ్యవసాయ పరపతి సహకార సంఘం చైర్మన్ బుస్సు పుల్లారెడ్డిపై అనర్హత వేటు పడింది. అవినీతి ఆరోపణలకు సంబంధించి బుస్సు పుల్లారెడ్డిని సస్పెండ్ చేస్తున్నట్లు జిల్లా కో ఆపరేటివ్ అధికారి ధాత్రీదేవి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. మంచాల పీఏసీఎస్ నూతన భవన నిర్మాణం, ధాన్యం కొనుగోళ్లకు సంబంధించి అవకతవకలు జరిగాయని రెండేళ్ల క్రితం పాలకవర్గ డైరెక్టర్లు ఇచ్చిన ఫిర్యాదుతో అధికారులు విచారణ జరిపారు. ఇందులో నూతన పీఏసీఎస్ భవన నిర్మాణంలో రూ.7.20 లక్షల అవినీతి జరిగినట్లుగా నిర్ధారించారు. దీంతో అవినీతికి పాల్పడిన వారి నుంచి ఆ డబ్బును రికవరీ చేయాల్సిందిగా ఆదేశించారు. అంతేకాకుండా చైర్మన్‌ను ఆ పదవి నుండి తప్పిస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. దీంతో ఇప్పటిదాకా వైస్‌చైర్మన్‌గా ఉన్న బొద్రమోని యాదయ్యను తాత్కాలిక చైర్మన్‌గా నియమిస్తూ ఉత్తర్వులు జారీచేశారు. చైర్మన్‌ను నియమించే దాకా ఆయన ఈ పదవిలో కొనసాగనున్నారు. ఈ సందర్భంగా డైరెక్టర్లు వెదిరె హన్మంత్‌రెడ్డి, జెనిగె వెంకటేష్ యాదవ్, వి.రాంరెడ్డి, పి.రమేష్, జనార్ధన్‌రెడ్డి, వేణుగోపాల్‌రావు, దోడ అరుణమ్మ మాట్లాడుతూ ఆలస్యంగానైనా తమ న్యాయపోరాటం గెలిచిందని చెప్పారు.

పోస్ట్‌మెట్రిక్ ఉపకార వేతనాల
దరఖాస్తులకు గడువు పొడిగింపు

వికారాబాద్, ఫిబ్రవరి 2: 2023-24 విద్యా సంవత్సరానికి గానూ జిల్లాలోని వివిధ ప్రైవేట్, ప్రభుత్వ కళాశాలల్లో విద్యనభ్యసిస్తున్న అర్హులైన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులు (ఫ్రెష్, రెన్యువల్)కు గాను పోస్ట్ మెట్రిక్ ఉపకార వేతనాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవడానికి జనవరి 31 వరకు గడువు ఉండగా మార్చి 31 వరకు పొడిగించినట్లు జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి ఎస్. మల్లేశం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు ఇట్టి అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఉపకారవేతనాల నమోదు ప్రక్రియ పోస్ట్‌మెట్రిక్ (ఫ్రెష్, రెన్యువల్)కు ఈ-పాస్ వెబ్ సైట్ హెచ్‌టీటీపీ://టీఈఎల్ఏఎన్‌జీఏఎన్ఏఈపీఏఎస్ఎస్.సీజీజీ.జీవోవీ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. అదేవిధంగా పెండింగ్‌లో ఉన్న 2022-23, 2023-24 విద్యాసంవత్సరాల పోస్ట్‌మెట్రిక్ హార్డ్ కాపీలు జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి కార్యాలయంలో త్వరగా సమర్పించాలని కోరారు.

యథేచ్ఛగా నాపరాతి అక్రమ తవ్వకాలు

- సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి మరీ అక్రమాలు
- ప్రభుత్వ ఆదాయానికి గండికొడుతున్న వ్యాపారులు



గనుల వద్ద ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు

తాండూరురూరల్, ఫిబ్రవరి 2: మండలంలోని మల్కాపూర్‌లో సీసీ కెమెరానిఘాలో నాపరాతి గనుల్లో పెద్దఎత్తున అక్రమ తవ్వకాలు జరుపుతున్నారు. మల్కాపూర్‌లోని సర్వేనెంబర్-70, 71లో వ్యాపారి వాసుదేవ్‌రెడ్డి పట్టా వ్యవసాయ భూమిని వ్యవసాయేతర భూమిగా మార్చకుండా, గనుల శాఖ నుంచి ఎలాంటి అనుమతులు తీసుకోకుండా అక్రమ విద్యుత్ వినియోగిస్తూ నాపరాతి తవ్వకాలు చేస్తున్నారు. ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నాడు. గనుల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి రాత్రింబవళ్లు తేడా లేకుండా నాపరాతిని వెలికితీస్తున్నారు. గనుల్లో అక్రమ తవ్వకాలకు విద్యుత్ వినియోగానికి ఇతరులకు చెందిన విద్యుత్‌ను అందించడంలో స్థానిక లైన్‌మన్‌కు నెలవారీగా పెద్దఎత్తున ముడుపులు చెల్లించినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. నాపరాతి తవ్వకాల వద్ద సీసీ కెమెరాలు ఉపయోగించొద్దని ఆదేశాలున్నా అవేమీ పట్టించుకోవడం లేదు. ఈ గనిలో మల్కాపూర్‌కు చెందిన కొంతమంది వ్యవసాయ పట్టా భూమిలో పెద్దఎత్తున నాపరాతి గనులు వెలికి తీశారు.



గనిలో కొనసాగుతున్న నాపరాతి తవ్వకాలు

ఈ గనులకు విద్యుత్ సరఫరా ఎక్కడి నుంచి వస్తుంది? ఎవరి పేరుపై ట్రాన్స్ ఫార్మర్, మీటర్లు ఉన్నాయనేది తెలియాల్సి ఉంది. విద్యుత్ సిబ్బంది అక్రమ సంపాదనకు అలవాటుపడి ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. నాపరాతి గనుల్లో అక్రమంగా తవ్వకాలుచేసి నాపరాతిని తరలిస్తున్నా చెక్‌పోస్టుల వద్ద ఎందుకు తనిఖీలు చేయడం లేదనే అనుమానాలు కూడా వ్యక్తమవుతున్నాయి. ఇక్కడ మామూళ్లు అందుతున్నట్లు తెలిసింది. గనుల అక్రమ తవ్వకాలపై గనుల శాఖ ఏడీ శామెల్ జాకబ్‌ను వివరణ కోరగా, అనుమతులు లేకుండా అక్రమంగా తవ్వకాలు చేస్తున్న గనులకు విద్యుత్ సరఫరా నిలిపివేసి, తవ్వకాలు చేస్తున్నవారిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. అక్రమ తవ్వకాలు జరుపుతున్న వారిపై కలెక్టర్, జిల్లా మైన్స్ ఉన్నతాధికారులు స్పందించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఘట్‌కేసర్ రూరల్, ఫిబ్రవరి 2: తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళ డిగ్రీ కళాశాల ఇబ్రహీంపట్నంలో రాజనీతి శాస్త్రం బోధించడానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ హెచ్.రాధిక శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. తమ కళాశాలలో రాజనీతిశాస్త్రం బోధించడానికి గెస్ట్ లెక్చరర్ కావాలన్నారు. ఈ పోస్టుకోసం ఎం.ఎ పొలిటికల్ సైన్స్, నెట్(ఎన్ఈటీ) లేదా సెట్(ఎస్ఈటీ)ఉన్న అభ్యర్థులకు ప్రాధాన్యత ఉంటుందని తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 9న జరిగే డెమో ఇంటర్వ్యూకు ఒరిజినల్ సర్టిఫికెట్లు తీసుకుని అంకుషాపూర్ ప్రిన్స్‌టన్‌లో నిర్వహిస్తున్న తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళ డిగ్రీ కళాశాలకు హాజరుకావాలన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు.

అంధకారంలో కాలనీలు

- వెలగని వీధి దీపాలు



పరిగిలో వెలగని విద్యుత్ దీపాలు

పరిగి, ఫిబ్రవరి 2: మునిసిపల్ పరిధిలోని పలు చోట్ల విద్యుత్ లైట్లు వెలుగక వివిధ కాలనీలు అంధకారంలో మగ్గుతున్నాయి. టెలిఫోన్ ఎక్స్‌చేంజి నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు, హైదరాబాద్-బీజాపూర్ ప్రధాన రహదారిపై లైట్లు సరిగావెలగడం లేదు. ఈ విషయంపై మునిసిపల్ అధికారులకు తెలిపినా పట్టించుకోవడం లేదని పలువురు వాపోతున్నారు. మెయిన్‌రోడ్డు లైట్ల మెయింటెన్స్‌పై కాంట్రాక్టర్, మునిసిపల్ అధికారులు ఒకరిపైఒకరు ఆరోపణలు చేసుకుంటూ దాట వేస్తున్నారని, అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని విమర్శిస్తున్నారు. లైట్లు వెలగక చీకటిమయంగా మారడంతో దొంగతనాలు జరుగుతున్నాయని, పలుచోట్ల లైట్లు ఎప్పుడు వెలుగుతాయో.. ఎప్పుడు ఆఫ్ అవుతాయో తెలియడంలేదని ఎద్దేవా చేస్తున్నారు. కొన్ని కాలనీల్లో ఆన్‌ఆఫ్ లేకపోవడంతో ఎప్పుడూ వెలుగుతూనే ఉంటాయని, లైట్లు పాడైపోయిన చోట నెలలు గడిచినా కొత్తవి బిగించడం లేదని చెబుతున్నారు.

ఎవరికి చెప్పినా పట్టించుకోవడం లేదు



మెయిన్‌రోడ్లపై లైట్లు వెలగడం లేదు. దీంతో రోడ్లు, కాలనీలు చీకటిమయమవుతున్నాయి. దొంగతనాలు జరుగుతున్నాయి. లైట్ల గురించి అడిగినా సంబంధిత అధికారులు స్పందించడం లేదు. కాంట్రాక్టర్‌ను అడిగితే తమకు సంబంధం లేదని దాటవేస్తున్నారు. కలెక్టర్ దృష్టికి తీసుకెళతా. -పి.చంద్రయ్య, మాజీ జడ్పీటీసీ

నిల్వ ఉంచిన మటన్ విక్రయిస్తే కఠిన చర్యలు



పరిగిలో మటన్ షాపులను తనిఖీ చేస్తున్న మునిసిపల్ చైర్మన్ అశోక్

పరిగి, ఫిబ్రవరి 2: నిల్వ ఉంచిన మటన్ విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని పరిగి మున్సిపల్ చైర్మన్ ఎం.అశోక్ హెచ్చరించారు. పరిగిలో పలు మటన్ షాపులను శుక్రవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రోజూవారీగా కట్ చేసిన మాంసాన్నే విక్రయించాలన్నారు. కట్‌చేసిన తర్వాత వారం, పది రోజులపాటు ఫ్రిజ్‌లో పెట్టి విక్రయిస్తే లైసెన్స్‌లు రద్దు చేస్తామని తెలిపారు. ప్రజల ఆరోగ్యాలతో చెలగాటం ఆడితే ఊరుకోబోమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ జి.శ్రీనివాసన్, కౌన్సిలర్లు టి.వెంకటేశ్, ఎదిరె కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

'రాడార్' స్టేషన్‌ను వ్యతిరేకించాలి

● చర్చావేదికలో వక్తలు

పరిగి, ఫిబ్రవరి 2 : పూడూరు మండలం దామగుండం అడవుల్లో నేవీ రాడార్ స్టేషన్ ఏర్పాటును వ్యతిరేకించాల్సిందేనని, ఆ టెక్నాలజీకి కాలం చెల్లిందని నిపుణులే చెబుతున్నారని పలువురు వక్తలు అన్నారు. పరిగిలోని బృందావన్ గార్డెన్‌లో రాడార్ స్టేషన్‌ను వ్యతిరేకిస్తూ శుక్రవారం ప్రకృతి విధ్వంసం - పరిణామాలు అనే అంశంపై జరిగిన చర్చావేదికలో పలువురు మాట్లాడుతూ దామగుండం పరిసరాల్లోని మూడు వేల ఎకరాల రిజర్వుఫారెస్ట్ భూములను రాష్ట్ర ప్రభుత్వం, కేంద్రప్రభుత్వానికి అప్పగించడం పట్ల అభ్యంతరం వ్యక్తం చేశారు. రాడార్ స్టేషన్ ఏర్పాటును అడ్డుకుంటామని తేల్చిచెప్పారు. అనేక రోగాలను నయం చేసే వనమూలికలకు ఈ అడవులు పుట్టినిల్లులాంటిదని, వాటిని నాశనం చేస్తే భవిష్యత్ తరాలకు తీవ్ర నష్టం వాటిల్లుదుందన్నారు. స్టేషన్ ఏర్పాటు చేస్తే పక్షులు, చెట్లు, జీవరాశులను కోల్పోతామని చెప్పారు. నేవీ రాడార్ స్టేషన్ ఏర్పాటుతో 12 వేల టవర్లు ఏర్పాటు చేయాల్సి వస్తుందని, వీటి ద్వారా వచ్చే రేడియేషన్‌తో ఈ ప్రాంత ప్రజలు రోగాల బారిన పడే అవకాశం ఉందని తెలిపారు. పూడూరులో కాకుండా ప్రత్యామ్నాయ ప్రాంతాలను పరిశీలించాలని సూచించారు. రాడార్ స్టేషన్ వద్దని త్వరలో సీఎం రేవంత్‌రెడ్డిని, శాసనసభ స్పీకర్ ప్రసాద్‌ను కలిసి విన్నవిస్తామని, అంతకుముందు జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రాన్ని అందజేస్తామని పరిరక్షణ కమిటీ సభ్యులు తెలిపారు. జిల్లాలోని అన్ని రాజకీయ పార్టీలు, ప్రజాప్రతినిధులతో సమావేశమై చర్చించాలని నిర్ణయించినట్లు తెలిపారు. రాష్ట్ర విద్య, మౌలిక సదుపాయాల కల్పన సంస్థ మాజీ చైర్మన్ జి.నాగేందర్‌గౌడ్, జడ్పీ వైఎస్‌చైర్మన్ విజయ్ కుమార్, పరిరక్షణ ప్రజా వేదిక సభ్యులు పాల్గొన్నారు.


పరిగిలో జరిగిన చర్చావేదికలో పాల్గొన్న అడవి ప్రకృతి పరిరక్షణ ప్రజా వేదిక సభ్యులు

హెల్మెట్‌తో ప్రాణాలకు రక్షణ

షాద్‌నగర్‌రూరల్, ఫిబ్రవరి 2 : హెల్మెట్‌తోనే వాహనదారుల ప్రాణాలకు రక్షణ ఉంటుందని, వాహనాలను నడిపే సమయంలో విధిగా హెల్మెట్ ధరించాలని శంషాబాద్ ట్రాఫిక్ ఏసీపీ చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. అదానీ కనెక్స్ డాటా సెంటర్ సహకారంతో శుక్రవారం షాద్‌నగర్ ట్రాఫిక్ ఎస్సై రవీందర్‌నాయక్ ఆధ్వర్యంలో ఎలికట్ట చౌరస్తాలో వాహనదారులకు ఉచితంగా హెల్మెట్లు అందించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ ద్విచక్రవాహనాలు నడిపే వారు రోడ్డు భద్రతా నియమాలు పాటించనందునే ప్రమాదానికి గురైనవారిలో 50 శాతం మంది చనిపోతున్నారని తెలిపారు. రాంగ్ రూట్‌లో డ్రైవింగ్, మద్యం తాగి వాహనాలు నడుపవద్దని సూచించారు. అదానీ గ్రూప్ ప్రతినిధులకు ధన్యవాదాలు తెలిపారు. హెల్మెట్ ధరించి వాహనం నడిపిన వారికి గులాబీలు ఇచ్చారు. ఎంవీఐ బాలూ నాయక్, అదానీ గ్రూప్ ప్రతినిధి రందన్ కుమార్ పాల్గొన్నారు.


వాహనదారులకు హెల్మెట్ పెడుతున్న ఏసీపీ

సదాశివపేట్‌కు 4 లేన్ల రోడ్డు

● గడ్కరీని కోరిన మంత్రి కోమటిరెడ్డి, ఎమ్మెల్యే
● రూ.700 కోట్లతో డీపీఆర్‌ను సిద్ధం చేయనున్న ఆర్అండ్‌బీ శాఖ

తాండూరు, ఫిబ్రవరి 2 : జాతీయ రహదారులను విస్తరించి ట్రాఫిక్ సమస్యను తీర్చేందుకు నిధులు కేటాయించాలని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి చేసిన విజ్ఞప్తికి కేంద్ర ప్రభుత్వం సానుకూలంగా స్పందించింది. ఢిల్లీలో గురువారం జరిగిన జాతీయ రహదారుల నిర్మాణ సమీక్ష సమావేశంలో వికారాబాద్ - తాండూరు - సదాశివపేట్ 4 లేన్ల రోడ్డు అంశం చర్చకు వచ్చింది. ఈ సందర్భంగా యాలాల మండలం లక్ష్మీనారాయణపూర్ నుంచి బషీరాబాద్ మండల కేంద్రాన్ని కలుపుతూ మైల్వార్ మీదుగా కర్నాటక రాష్ట్రంలోని అడికే వరకు 4 లేన్ల జాతీయ రహదారి నిర్మాణం చేపట్టాలని రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీని కోరారు. మన్నెగూడ నుంచి వికారాబాద్ మీదుగా తాండూరు వరకు, తాండూరు నుంచి పెద్దేముల్ , కోట్‌పల్లి, మోమిన్‌పేట్, మీదుగా సదాశివపేట్ వరకు సుమారు 135 కిలోమీటర్ల రోడ్డు కోసం రూ.700 కోట్ల వ్యయం అవుతుందని ఆర్అండ్‌బీ అధికారులు ప్రాథమికంగా అంచనా వేసి ప్రభుత్వానికి నివేదిక పంపించారు. రాష్ట్ర వ్యాప్తంగా 14 రోడ్లను జాతీయ రహదారులుగా విస్తరించి అభివృద్ధి చేయాలని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించింది. వాటిలో వికారాబాద్ - తాండూరు - సదాశివపేట్ 4 లేన్ల రోడ్డుకు మొదటి ప్రాధాన్యత కల్పించింది. వికారాబాద్ - తాండూరు రోడ్డును తొర్మామిడి, కోహిర్ మీదుగా జహీరాబాద్ వరకు విస్తరించాలని భావించినప్పటికీ తాండూరు, పెద్దేముల్, కోట్‌పల్లి, మోమిన్‌పేట్ వరకు విస్తరించాలని స్పీకర్ ప్రసాద్‌కుమార్ సూచించారు.


గడ్కరీకి వినతిపత్రం ఇస్తున్న మంత్రి కోమటిరెడ్డి, ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

సర్పంచుల ఆత్మహత్యలు బాధించాయి

●జడ్పీ చైర్‌పర్సన్ సునీతామహేందర్ రెడ్డి

ధారూరు, ఫిబ్రవరి 2 : అభివృద్ధి పనుల కోసం చేసిన అప్పులు తీర్చలేక 13 మంది సర్పంచులు ఆత్మహత్యలు చేసుకోవటం తనను చాలా బాధించిందని జడ్పీ చైర్‌పర్సన్ సునీతామహేందర్‌రెడ్డి అన్నారు. ఎన్నికలలో డబ్బుతో గెలిచే విధానాన్ని మార్చేందుకు అందరూ కృషి చేయాలని ఆమె పిలుపునిచ్చారు. డబ్బు, పదవులు శాశ్వతం కాదని ప్రజల గుండెల్లో ఉండాలని అన్నారు. పదవీకాలం ముగిసిన సర్పంచులను ఎంపీపీ విజయలక్ష్మి ఆధ్వర్యంలో శుక్రవారం ధారూరులో ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జడ్పీ చైర్‌పర్సన్ పాల్గొని మాట్లాడుతూ సర్పంచులు చాలా కష్టపడి, నిత్యం ప్రజా సమస్యల పరిష్కారం కోసం పని చేశారని ప్రశంసించారు. సొంత డబ్బులతో పాటు అప్పులు చేసి అభివృద్ధి పనులు చేశారని గుర్తుచేశారు. వారు చేసిన పనులకు సకాలంలో ఎంబీ రికార్డులు చేయించి బిల్లులు చెల్లించేలా అధికారులు చూడాలని అన్నారు. తన దృష్టికి తీసుకోవస్తే పెండింగ్ బిల్లులు ఇప్పించేందుకు కృషి చేస్తానని చెప్పారు. కొంతమంది సర్పంచులు అవినీతి, అక్రమాలు చేయటం వల్ల మిగతా వారికి చెడ్డ పేరు వచ్చిందని అన్నారు. అనంతరం పదవీ కాలం పూర్తయిన మాజీ సర్పంచులను ఆమె సన్మానించారు. ఎంపీపీ విజయలక్ష్మి, వాలీబాల్ అసోయేషన్ జిల్లా అధ్యక్షుడు హన్మంత్‌రెడ్డి, ఎంపీడీవో చెన్నారెడ్డి, సర్పంచులు, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.


మాజీ సర్పంచులను సన్మానిస్తున్న జడ్పీ చైర్‌పర్సన్

మల్లారెడ్డివి దిగజారుడు మాటలు

●టీపీసీసీ ఉపాధ్యక్షుడు వజ్రేష్ యాదవ్



ఘట్‌కేసర్, ఫిబ్రవరి 2 : మాజీ మంత్రి చామకూర మల్లారెడ్డి చేసిన భూకబ్జాలు, అవినీతి నుంచి తప్పించుకునేందుకే దిగజారుడు మాటలు మాట్లాడుతున్నారని టీపీసీసీ ఉపాధ్యక్షుడు, కాంగ్రెస్ మేడ్చల్ ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్ యాదవ్ అన్నారు. శుక్రవారం ఆయన ఘట్‌కేసర్‌లో విలేకరులతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిస్తే తప్పేముందని, సీఎం మెప్పుపొందేందుకే దిగజారి మాట్లాడుతున్నాడని ఎద్దేవా చేశారు. ఎప్పటికైనా మల్లారెడ్డి, కుటుంబం జైలుకెళ్లడం ఖాయమన్నారు. నిరుపేదలకు, ప్రభుత్వానికి చెందిన వందలాది ఎకరాల భూములను కబ్జా చేసి భారీ అవినీతికి పాల్పడ్డాడని ఆరోపించారు. మల్లారెడ్డికి తగిన గుణపాఠం చెప్పేందుకు మల్కాజిగిరి నియోజకవర్గ ప్రజలు సిద్ధంగా ఉన్నారని చెప్పారు.

బాలుడి మృతిపై అధికారుల స్పందన

వీధికుక్కల పట్టివేత

శంషాబాద్, ఫిబ్రవరి 2 : శంషాబాద్ పట్టణంలోని సామ ఎన్‌క్లేవ్ శివారులో వీధికుక్కల దాడిలో చిన్నారి చనిపోయిన ఘటనలో మునిసిపల్ అధికారులు స్పందించారు. శుక్రవారం వివిధ బస్తీల్లో మునిపల్ సిబ్బంది 30 కుక్కలను వీధికుక్కలను పట్టుకుని తరలించారు. ఈ సందర్భంగా శానిటరీ ఇన్‌స్పెక్టర్ లక్ష్మయ్య మాట్లాడుతూ ఆరు నెలలుగా వీధికుక్కలన్నింటిని పట్టుకొని స్టెరిలైజేషన్, వాక్సినేషన్ చేస్తున్నట్లు చెప్పారు. కుక్కల నిర్మూలనకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. కాగా పట్టణంలోని సామ ఎన్‌క్లేవ్ శివారులో ఉన్న జెఎన్ఎన్‌యూఆర్ గృహాల సమీపంలో గుడిసె వేసుకొని నివాసముంటున్న కూలీ సూర్యకుమార్ కుమారుడు గుడిసెలో తన నానమ్మతో కలిసి నిద్రిస్తుండగా బాలుడిపై కుక్కలు దాడి చేసి బయటకు లాక్కెళ్లగా తీవ్రగాయాలై మరణించిన విషయం తెలిసిందే. ఈ సంఘటన స్థానికంగా తీవ్ర సంచలనం సృష్టించింది. శంషాబాద్ మున్సిపాలిటీలో మక్కాబహద్దూర్‌అలీబస్తీ, హైమద్‌నగర్, నర్సింగ్ మందిర్ రోడ్డు బస్తీలో కూడా రెండు నెలల క్రితం వీధి కుక్కల దాడిలో మధన్, మీరజ్, మస్కాన్, నైరా, ఆజం అనే చిన్నారులు గాయపడ్డ విషయం తెలిసిందే. అప్పుడు కూడా అధికారులు అప్రమత్తమై కుక్కలను పట్టుకొని ఇతర ప్రాంతాలకు తరలించారు. గురువారం వీధికుక్కలు చిన్నారిపై దాడిచేసి చేయడం వల్ల మృతిచెందడంతో వాటి స్వైర విహారం మరోసారి బయటకు వచ్చింది. తగు చర్యలు తీసుకొని వీధికుక్కల బెడద నివారించాలని స్థానికులు కోరుతున్నారు. మున్సిపల్ అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవడంలేదని కౌన్సిలర్ కొండప్రవీణ్‌కుమార్ గౌడ్ ఆరోపించారు.


సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న మునిసిపల్ సిబ్బంది


బస్తీలో సంచరిస్తున్న కుక్కలు

నిబంధనలు బేఖాతర్!

●సీజ్ చేసినా.. రైస్‌మిల్లును తెరిచిన వ్యాపారి
●గేటుకు తాళం వేసి సీల్ వేసినా ఓపెన్


అంతారం గ్రామ శివారులో సీజ్ చేసిన రైస్‌మిల్లును తెరిచిన మిల్లర్లు

తాండూరురూరల్, ఫిబ్రవరి 2 : అంతారంలో అనుమతులు లేకుండా కొనసాగుతున్న రైస్‌మిల్లును అధికారులు సీజ్ చేసినా యజమాని మిల్లును తెరిచి తన వ్యాపారం కొనసాగిస్తున్నాడు. రైస్ మిల్లు ప్రారంభించిన విషయం తెలుసుకున్న పంచాయతీ కార్యదర్శి ఇస్మాయిల్ సంఘటా స్థలానికి చేరుకుని అనుమతి పత్రాలు చూపించాలని కోరారు. ఎలాంటి అనుమతి లేవని, మీకెందుకు చూపించాలని వ్యాపారి దురుసుగా బదులిచ్చారు. దీంతో కార్యదర్శి నిబంధలన మేరకు నోటీసును రైస్‌మిల్లు గేటుకు అంటించారు. అనంతరం గేటుకు తాళం వేసి సీజ్ చేశారు. ఎలాంటి అనుమతి లేకుండా రైస్‌మిల్లు వద్ద పెద్దఎత్తున ధాన్యం బస్తాలు నిల్వ చేశారు. నిబంధనలకు విరుద్ధంగా యంత్రాలతో పనులు ప్రారంభించారు. రైసు మిల్లు యజమాని పలు నేతల పేర్లు వాడుకుని అధికారులను బోల్తా కొట్టిస్తున్నాడు. అనుమతులు లేకుండానే రైస్‌మిల్లు కొనసాగిస్తున్న యజమానిపై అధికారులు ఎలాంటి చర్యలు తీసుకుంటారో వేచి చూడాలి. సీజ్ చేసిన విషయమై మండల అధికారులను వివరణ కోరగా, తమకు తెలియదని, గ్రామ కార్యదర్శికి తెలపాలని దాటవేశారు.

పోలీసుల సమయస్ఫూర్తి.. రూ.4లక్షల సొత్తు రికవరీ

కడ్తాల్, ఫిబ్రవరి 2: ధ్యాన వేడుకలకు వస్తూ కర్ణాటకకు చెందిన ఓ మహిళ పోగొట్టుకున్న సొత్తును కడ్తాల పోలీసులు సమయ స్ఫూర్తితో రికవరీ చేశారు. సుమారు రూ.4లక్షల విలువ చేసే వస్తువులు, బంగారు నగలను బాధితురాలికి అందజేసి ప్రశంసలందుకున్నారు. కడ్తాల పోలీసు స్టేషన్‌లో శుక్రవారం సాయంత్రం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ శివప్రసాద్ వివరాలు వెల్లడించారు. కర్ణాటకలోని హుబ్లీకి చెందిన శశికళ గత డిసెంబరు 23న కడ్తాల మండలం అన్మాస్‌పల్లి సమీపంలోని కైలాసపురి మహేశ్వర మహాపిరమిడ్‌లో జరిగిన ధ్యాన వేడుకలకు హాజరయ్యారు. ఈక్రమంలో ఆమె వద్ద ఉన్న రూ.4 లక్షల విలువ చేసే ల్యాప్‌టాప్, 3 బంగారు ఉంగరాలు, గోల్డ్‌చైన్, లాకెట్, డైమండ్ చెవికమ్మలు, చార్జర్స్, ఇయర్ బర్డ్స్ కారులో పోగొట్టుకుంది. ఈమేరకు కారులో తన వస్తువులు పోయిన విషయమై కడ్తాల పోలీసులకు అప్పట్లోనే శశికళ ఫిర్యాదు చేసింది. ఏఎస్ఐ నిరంజన్, మహిళా కానిస్టేబుల్ దివ్యవాణి, సిబ్బంది కారును ట్రేస్‌చేసి గుర్తించారు. అందులో శశికళ పోగొట్టుకున్న వస్తువులను స్వాధీన పరుచుకొని శశికళకు అందజేశారు. సొత్తును రికవరీ చేసి బాధితురాలికి అందజేసిన పోలీసు సిబ్బందిని సీఐ శివప్రసాద్, ఎస్సైలు వరప్రసాద్, హరిశంకర్‌గౌడ్‌లు అభినందించారు.


బాధితురాలికి సొత్తు అందిస్తున్న సీఐ శివప్రసాద్

అంబేడ్కర్, పూలే ఆశయాల సాధనకు కృషి

షాబాద్, ఫిబ్రవరి 2 : అంబేడ్కర్, పూలే ఆశయాల సాధనకు నిరంతరం కృషి చేస్తానని అంబేడ్కర్, పూలే అవార్డు గ్రహీత నారాయణదాసు అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని తెలంగాణ మోడల్ స్కూల్ ఆవరణలో సావిత్రీబాయిపూలే విగ్రహ ప్రతిష్ఠాపన కోసం భూమిపూజ చేశారు. అనంతరం పదోతరగతి విద్యార్థులకు పరీక్ష ప్యాడ్‌లను అందజేశారు. మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ శ్రీవాచ్ఛ, పాఠశాల కమిటీ చైర్మన్ గూడురు శ్రీనివాస్, నాయకులు కృష్ణ, జంగయ్య, శ్రీనివాస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


సావిత్రీబాయిపూలే విగ్రహానికి భూమి పూజ చేస్తున్న నారాయణదాసు

సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలి : ఎంపీపీ

యాచారం, ఫిబ్రవరి 2 : మారుమూల గ్రామాలకు వెళ్లి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ప్రత్యేకాధికారులు చొరవ తీసుకోవాలని ఎంపీపీ సుకన్య బాషా అన్నారు. ప్రత్యేకాధికారులకు తాజా మాజీ సర్పంచులు అందుబాటులో ఉంటూ సహకరించాలన్నారు. శుక్రవారం మండల పరిషత్ సమావేశ మందిరంలో వారితో సమావేశమయ్యారు. ఎంపీపీ మాట్లాడుతూ ముఖ్యంగా తాగునీరు కలుషితం కాకుండా చూడాలని, ఎండాకాలంలో నీటి కోసం జనం ఇబ్బందులు పడకుండా చొరవ తీసుకోవాలన్నారు. వీధి దీపాలు ఎప్పటికప్పుడు పరిశీలన చేసి కాలిపోయిన వాటి స్థానంలో కొత్త బల్బులు బిగించాలన్నారు. హరితహారం మొక్కలు ఎండిపోకుండా చూడాలన్నారు. వాటర్ ట్యాంకులను శుభ్రం చేసి బ్లీచింగ్ పౌడర్ చల్లించాలన్నారు. ఇంటి, వృత్తి పన్నులు వంద శాతం వసూలు చేయాలన్నారు. తహసీల్దార్ శ్రీకాంత్‌రెడ్డి, ఎంపీడీవో విజయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎంపీపీ సుకన్య

ఎమ్మెల్యేకు ఎంపీ పరామర్శ

చేవెళ్ల, ఫిబ్రవరి 2 : కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ నగరంలోని యశోద ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్యను ఎంపీ రంజిత్‌రెడ్డి పరామర్శించారు. పార్లమెంట్ సమావేశాలకు హాజరై ఢిల్లీ నుంచి శంషాబాద్ ఎయిర్‌పోర్టు చేరుకుని అక్కడినుంచి నేరుగా శుక్రవారం రాత్రి ఆసుపత్రికి చేరుకున్నారు. ఎమ్మెల్యేను పరామర్శించి ఆయన ఆరోగ్య పరిస్థితి గురించి వైద్యులను అడిగి తెలుసుకున్నారు.


ఆసుపత్రిలో ఎమ్మెల్యే యాదయ్యను పరామర్శిస్తున్న ఎంపి రంజిత్‌రెడ్డి

అవకతవకలు పునరావృతం కాకుండా చూడాలి : డీఆర్‌డీఏ పీడీ

మాడ్గుల, ఫిబ్రవరి 2 : మహాత్మాగాంధీ జాతీయ ఉపాధిహామీ పథకంలో చేసిన పనులలో ఎలాంటి అవకతవకలు పునరావృతం కాకుండా చూడాలని డీఆర్‌డీఏ పీడీ ప్రభాకర్ ఫీల్డ్ అసిసెంట్లకు సూచించారు. 33 గ్రామపంచాయతీలలో చేసిన ఉపాధి హామీ పనులపై 10రోజుల పాటు సామాజిక బృందం తనిఖీ చేసింది. సామాజిక ప్రజావేదికను మండల కార్యాలయం ఆవరణలో శుక్రవారం నిర్వహించారు. ఉపాధి పనులకు చేసిన ఖర్చులను వివరించారు. చేయని పనులకు కూడా బిల్లు ఇచ్చినట్లు, ఎక్కువ ఖర్చు చేసినట్లు రికార్డు చేసినట్లు సామాజిక తనఖీలో తేలింది. మొక్కలను రక్షించలేకపోయారని, వాటిపై వృథాగా ఖర్చుపెట్టారని మండిపడ్డారు.

పథకాల అమలులో టీఎన్జీవోస్ పాత్ర కీలకం

వికారాబాద్, ఫిబ్రవరి 2: ప్రభుత్వ పథకాల అమలులో టీఎన్జీవోస్ పాత్ర కీలకమని టీఎన్జీవోస్ రాష్ట అధ్యక్షుడు మరం జగదీశ్వర్ అన్నారు. వికారాబాద్ జిల్లా కేంద్రంలో టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు శివకుమార్ ఆధ్వర్యంలో శుక్రవారం కార్యవర్గ సమావేశం నిర్వహించారు. అనంతరం రాష్ట్ర అధ్యక్షుడు మరం జగదీశ్వర్ మాట్లాడుతూ.. టీఎన్జీవోస్ తెలంగాణ ఉద్యమంలో ఉద్యోగులు కీలక భూమిక పోషించారని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ గెలుపుపరే టీఎన్జీవోస్ కృషి చేసిందని, టీఎన్జీవోస్ ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని కోరారు. టీఎన్జీవోస్ పార్టీకి తొత్తుగా వ్యవహరిస్తుందని పలువురు అనడం బాధాకరమన్నారు. ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ ప్రభుత్వానికి టీఎన్జీవోస్ పనిచేస్తారని గుర్తు చేశారు. కొత్తగా కొలువుదీరిన ప్రభుత్వం ఉద్యోగులకు ఐదో తారీఖు లోపు జీతాలను ఖాతాలో జమచేయడం శుభ పరిణామమని అన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేట్ అధ్యక్షులు కస్తూరి వెంకటేశ్వర్లు, రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు లక్ష్మణ్, కార్యవర్గ సభ్యులు అజ్మత్ పాషా, నర్సింలు, రమేష్, శివకుమార్, రామకృష్ణ, శ్రీదేవి, అరుణ ఉద్యోగులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న టీఎన్జీవోస్ రాష్ట్ర అధ్యక్షుడు మరం జగదీశ్వర్

దేశ ఖ్యాతిని ప్రపంచానికి చాటిన మోదీ

● మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

షాబాద్, ఫిబ్రవరి 2 : దేశ ఖ్యాతి, ప్రతిష్ఠను ప్రపంచానికి చాటిన వ్యక్తి ప్రధాని నరేంద్రమోదీ అని చేవెళ్ల మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం షాబాద్ మండల కేంద్రంలోని అన్‌మోల్ గార్డెన్‌లో బూత్‌స్థాయి నాయకులు, శక్తి కేంద్ర ఇన్‌చార్జిలతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 500 సంవత్సరాల చరిత్ర గల రామమందిరం సమస్యను చాకచక్యంగా పరిష్కరించి, గత నెల 22న 150 దేశాల్లో రామనామస్మరణను మారుమోగించారన్నారు. వచ్చే ఎన్నికల్లో టికెట్ ఇచ్చినా, ఇవ్వకున్నా పార్టీ అభివృద్ధి కోసం పని చేస్తానన్నారు. గ్రామాల్లో బూత్ స్థాయి నుంచి బీజేపీని బలోపేతం చేసి వచ్చే ఎన్నికల్లో పార్టీ అభ్యర్థి గెలుపుకు కృషి చేయాలని కోరారు. మాజీ ఎమ్మెల్యే కెఎస్ రత్నం, అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్ ప్రతాప్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి వెంకట్‌రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి శ్రీధర్‌రెడ్డి, స్వచ్ఛ భారత్ సెల్ రాష్ట్ర కన్వీనర్ రాము, మండలాధ్యక్షుడు కిరణ్, నాయకులు రవీందర్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, మాణయ్య, నారాయణ, విష్ణువర్ధన్‌రెడ్డి, గోపాల్, మహేందర్, సత్యం, మహేష్, హరీష్, జనార్దన్‌రెడ్డి, జైపాల్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, నర్సింహులు, రాఘవేందర్, శ్రీధర్, పవన్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

గ్రామాల్లో ప్రత్యేకాధికారుల బాధ్యతల స్వీకరణ



చేవెళ్ల : బాధ్యతలు స్వీకరిస్తున్న తహసీల్దార్ కృష్ణయ్య

కడ్తాల్, ఫిబ్రవరి 2 : కడ్తాల గ్రామ పంచాయతీ ప్రత్యేక అధికారిగా ఎంపీడీవో రామకృష్ణ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. జీపీ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టిన అనంతరం రామకృష్ణను వైస్ ఎంపీపీ ఆనంద్, మాజీ సర్పంచ్ జీఎల్ఎన్ రెడ్డి, కార్యదర్శి రాఘవేందర్, పలువురు నాయకులు సన్మానించారు. అనంతరం మైసిగండి మైసమ్మ దేవాలయాన్ని రామకృష్ణ సందర్శించి అమ్మవారికి పూజలు నిర్వహించారు.
చేవెళ్ల : ప్రత్యేక అధికారుల బాధ్యతల స్వీకరణలో భాగంగా ప్రభుత్వం మండలంలోని 37 గ్రామ పంచాయతీలకు గెజిటెడ్ అధికారులను నియమించింది. ఈ మేరకు శుక్రవారం జీపీల్లో బాధ్యతలు తీసుకున్నారు. చేవెళ్ల మండలంలో చేవెళ్ల, కేసారం, ఇబ్రహీంపల్లి గ్రామాలకు ప్రత్యేకాధికారిగా తహసీల్దార్ కృష్ణయ్య, ఆలూర్, హస్తేపూర్, అంతారంలకు ఎంపీడీవో హిమాబిందు, అల్లావాడ, గుండాల, మల్లారెడ్డిగూడలకు ఎంపీవో విఠలేశ్వర్, ముడిమ్యాల్, రావులపల్లి, మల్కాపూర్‌లకు సీడీపీవో శోభారాణి, పామెన, చనువల్లి, బస్తేపూర్‌లకు ఏవో తులసి, తంగడ్‌పల్లి, కౌకుంట్లకు ఏవో టెక్నికల్ అధికారి చైతన్య, ఊరెళ్ల, దేవునిఎర్రవల్లికి వార్డెన్ వెంకటయ్య, పలుగుట్ట, కందవాడలకు పశువైద్యాధికారి వి.శిరీష, కమ్మెట, గొల్లగూడలకు పశువైద్యాధికారి దేవేందర్‌రెడ్డి, దామరగిద్ద, మీర్జగూడ గ్రామాలకు రెవెన్యూ డిపార్ట్‌మెంట్ ఏవో సుదర్శన్‌రెడ్డి, దేవరంపల్లి, రేగడిఘనాపూర్‌లకు ఆర్అండ్‌బీ ఏఈ చంద్రశేఖర్, ఖానాపూర్, నాన్‌చెరు గ్రామాలకు ఇరిగేషన్ ఏఈఈ ఎస్.వక్మనిసా, కుమ్మెర, గొల్లపల్లిలకు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ గీతాశ్రవంతి, న్యాలట, రామన్నగూడ గ్రామాలకు డీటీ కె.రాకేశ్, ఎన్కెపల్లి, ఈర్లపల్లికి డీటీ బి.వినయ్, సిగప్పగడూడ, తాల్లారం గ్రామాలకు డీటీ ఎస్.రాజేందర్‌లను ప్రత్యేక అధికారులుగా నియమించింది.

రికార్డులు అప్పగించిన తాజా మాజీ సర్పంచులు

● **ఇబ్రహీంపట్నం** : మండలంలోని రాయపోల్, ముకునూరు గ్రామాల ప్రత్యేకాధికారిగా ఎంపీడీవో వెంకటమ్మ, దండుమైలారం, నెర్రెపల్లికి తహసీల్దార్ అన్వర్, పోల్కంపల్లి, నాగన్‌పల్లికి ఎంపీవో ఎన్.లక్ష్మతి నాయక్, ఉప్పరిగూడ, పోచారంలకు పంచాయతీరాజ్ ఏఈ గుర్రం ఇంద్రసేనారెడ్డి, ఎలిమినేడు, తులేకలాన్‌కు డిప్యూటీ తహసీల్దార్ కె.శ్రీనివాస్, చెర్లపటేల్‌గూడకు సీడీపీవో జి.శాంతిశ్రీ, కర్నంగూడకు ఏఈ (మిషన్ భగీరథ) అనిరుధ్‌రెడ్డి, కప్పాడుకు మండల వ్యవసాయాధికారి కెఎం వరప్రసాద్‌రెడ్డి, తుర్కగూడలో ఏఈ(గ్రిడ్)కె.ప్రణీత్‌లు బాధ్యతలు తీసుకున్నారు.
కేశంపేట : మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో ప్రత్యేకాధికారులు బాధ్యతలు స్వీకరించారు. కేశంపేట, సుందరాపురం గ్రామానికి ఎంపీడీవో రవిచంద్రకుమార్‌రెడ్డి, కొత్తపేట, బైర్కాన్‌పల్లికి తహసీల్దార్ అజాంఅలీ, తొమ్మిదిరేకుల, నిర్దవెల్లికి ఎంపీవో నర్సింలు, కాకునూర్, కొండారెడ్డిపల్లికి ఎంఏవో శిరీష, చౌలపల్లి, సంతాపూర్, కొనాయపల్లి గ్రామాలకు ఇరిగేషన్ ఏఈ మాధవి, లేమామిడి, బొదునంపల్లి, లింగంధన గ్రామాలకు పీఆర్ఏఈ భూపాల్, వేముల్‌నర్వ, చింతకుంటపల్లి గ్రామాలకు ఎంఈవో మనోహర్, అల్వాల, మంగళగూడ, పాటిగడ్డ గ్రామాలకు ఇరిగేషన్ ఏఈ గీత, పాపిరెడ్డిగూడ, తూర్పుగడ్డ తండాలకు మిషన్ భగీరథ ఏఈ నాగమణి, ఎక్లాస్‌ఖాన్‌పేట, పోల్కొనిగుట్ట తండాలకు మిషన్ భగీరథ ఏఈ కుసుమ, సంగెం, పుట్టోనిగూడలకు డిప్యూటీ తహసీల్దార్ గీత, ఇప్పలపల్లి, దత్తాయపల్లికి వెటర్నరీ డాక్టర్ నివేదిత, పోమాల్‌పల్లి, దేవునిగుడి తండాలో వెటర్నరీ డాక్టర్ సబితలు బాధ్యతలు స్వీకరించారు.



కడ్తాల్ : బాధ్యతలు స్వీకరిస్తున్న ఎంపీడీవో రామకృష్ణ

కొత్తూర్ : మండలంలో 12 గ్రామపంచాయతీలుండగా పలువురు గెజిటెడ్ అధికారులు ప్రత్యేకాధికారులుగా నియమితులయ్యారు. ఇన్ముల్‌నర్వకు ఎంపీడీవో దండు శరత్‌చంద్రబాబు, పెంజర్లకు తహసీల్దార్ జానకి, తీగాపూర్‌కు డిప్యూటీ ఈఈ మెహన్‌రావు, సిద్ధాపూర్‌కు ఎంపీవో విజయలక్ష్మి, గుడూర్, మక్తగూడకు ఆర్అండ్‌బీ ఏఈ సందీప్, ఎస్‌బీ పల్లి, కొడిచర్లకు వ్యవసాయాధికారి గోపాల్‌నాయక్, మల్లాపూర్, మల్లాపూర్‌తండాకు నీటిపారుదల శాఖ ఏఈ రవీందర్‌రెడ్డి, కొడిచర్ల, వైఎం తండాకు డిప్యూటీ తహసీల్దార్ జంగయ్యలు నియమితులయ్యారు.
చౌదరిగూడ : పదవికే విరమణ ఉంటుందని, ప్రజాసేవకు కాదని చౌదరిగూడ మండల తాజా మాజీ సర్పంచ్‌లు కమ్మరి భూపాలచారి, ప్రేమ్‌కుమార్, శివలు అన్నారు. మండలంలోని 24గ్రామాల్లో ప్రత్యేకాధికారుల పాలన ప్రారంభమైంది. మొత్తం 8మంది అధికారులకు సర్పంచులు జీపీ రికార్డులను అప్పగించారు. పెద్దఎల్కిచర్లలో ఎంపీడీవో మహేష్‌బాబు, జిల్లేడ్ చౌదరిగూడలో తహసీల్దార్ విజయ్‌కుమార్ ప్రత్యేకాధికారులుగా నియమితులయ్యారు.



చౌదరిగూడ : పెద్దఎల్కిచర్లలో ఎంపీడీవో మహేష్‌బాబుకు రికార్డులు అప్పగిస్తున్న భూపాలచారి

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో ప్రభుత్వ ఉపాధ్యాయుడి మృతి

మహేశ్వరం, ఫిబ్రవరి 2 : రోడ్డు ప్రమాదంలో ప్రభుత్వం ఉపాధ్యాయుడు మృతిచెందిన ఘటన మహేశ్వరం పోలీసుస్టేషన్ పరిధిలో శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. శ్రీశైలం-హైదరాబాద్ ప్రధాన రహదారి బీటీఆర్ పార్కు ప్రధాన మార్గం వద్ద ఎదురెదురుగా వస్తున్న మినీ డీసీఎం, మారుతీ కారు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న నాగర్‌కర్నూల్ జిల్లా తెల్కపల్లికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు మాధవరం వెంకట్‌రావ్(49) అక్కడికక్కడే మృతిచెందాడు. ఆయన కారులో హైదరాబాద్ వెళ్తుండగా ప్రమాదం జరిగింది. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రవిందర్ తెలిపారు.

బెల్టుషాపులపై పోలీసుల దాడులు

యాచారం, ఫిబ్రవరి 2 : మండలంలోని మొండిగౌరెల్లిలో శుక్రవారం సాయంత్రం పోలీసులు బెల్టుషాపులపై దాడులు చేశారు. అచ్చన శ్రీశైలం, శేఖర్ ఇళ్లపై దాడిచేసి 15 బాటళ్ల మద్యం స్వాధీనం చేసుకున్నారు. నందివనపర్తిలో గురువారం రాత్రి బెల్టు దుకాణాలు మూసివేయాలని గ్రామ యువకులు ర్యాలీ నిర్వహించిన సంగతి తెలిసిందే. దాంతో శుక్రవారం పోలీసులు నందివనపర్తిలో దాడులు చేయగా బెల్టు దుకాణాల్లో మద్యం లభించలేదని చెప్పారు. బెల్టుదుకాణాలు నడిపితే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని సీఐ సైదయ్య హెచ్చరించారు.

బీఆర్ఎస్ పాలనలోనే గ్రామాల అభివృద్ధి



దేవునిపల్లిలో బీఆర్ఎస్ కార్యకర్తలతో సమావేశమైన మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్

షాద్‌నగర్‌రూరల్, ఫిబ్రవరి 2 : బీఆర్ఎస్ పాలనలోనే గ్రామాలు అన్నివిధాలా అభివృద్ధి చెందాయని మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ తెలిపారు. ఫరూఖ్‌నగర్ మండలం కందివనం, మొగిలిగిద్ద, రంగంపల్లి, ఎల్లంపల్లి, దేవునిపల్లి, అయ్యావారిపల్లి, ఉప్పరిగడ్డ, చించోడు, పీర్లగూడ, దొంతికుంట తండాలో శుక్రవారం పర్యటించారు. ఆయా చోట్ల ఆయన మాట్లాడుతూ సర్పంచ్‌లు గ్రామాల అభివృద్ధికి ఎంతో కృషి చేశారని, ఓడిపోయినందుకు కుంగిపోవద్దని, కార్యకర్తలకు ఎప్పుడూ అండగా ఉంటానని చెప్పారు. ఎటువంటి సమస్యలున్నా తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీలను అమలుచేయాలని ఆయన అన్నారు. ఆయా కార్యక్రమాల్లో నాయకులు లక్ష్మణ్‌నాయక్, వీరేశం, మన్యానాయక్, కుర్వ మల్లేష్, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

పదవికే విరమణ.. ప్రజాసేవకు కాదు

● కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే గుర్కా జైపాల్ యాదవ్
● పదవీకాలం పూర్తయిన జీపీ కార్యవర్గాలకు సన్మానం

కడ్తాల్, ఫిబ్రవరి 2 : విరమణ పదవికే తప్ప ప్రజాసేవకు కాదని కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే గుర్కా జైపాల్‌యాదవ్ అన్నారు. ప్రజా జీవితంలో రాజకీయ ఎదుగుదలకు సర్పంచ్ పదవి తొలిమెట్టని అన్నారు. పదవీకాలం ముగిసిన కడ్తాల సర్పంచ్ గూడూరు లక్ష్మీనర్సింహరెడ్డి శుక్రవారం జైపాల్ యాదవ్‌ను ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఐదేళ్ల పదవీకాలంలో గ్రామాభివృద్ధికి ప్రభుత్వపరంగా అందించిన సహకారానికి కృతజ్ఞతలు తెలిపారు. జీఎల్ఎన్ రెడ్డిని జైపాల్ యాదవ్ సన్మానించి అభినందించారు. పంచాయతీలకు నియమితులైన ప్రత్యేక అధికారులు ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యలపై ఎప్పటికప్పుడు స్పందించాలని జైపాల్ యాదవ్ సూచించారు.



కడ్తాల్ : జీఎల్ఎన్ రెడ్డిని సన్మానిస్తున్న జైపాల్ యాదవ్



మొయినాబాద్ రూరల్ : బాకారం జాగీర్ సర్పంచ్ కొత్తపల్లి రాఘవరెడ్డిని సన్మానిస్తున్న గ్రామస్థులు

ఆమనగల్లు : మండల పరిధిలోని మేడిగడ్డ జీపీ కార్యాలయంలో పంచాయతీ పాలక వర్గానికి అభినందన కార్యక్రమం నిర్వహించారు. కాంగ్రెస్ జిల్లా సీనియర్ నాయకుడు నేనావత్ రవీందర్ నాయక్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో గ్రామస్తులు, నాయకులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. సర్పంచ్ అమర్ సింగ్, ఉపసర్పంచ్ మల్లేశ్‌నాయక్, వార్డు సభ్యులను రవీందర్‌నాయక్ పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. గ్రామాభివృద్ధికి వారు అందించిన సేవలను కొనియాడారు. ఎంపీవో శ్రీలత, కార్యదర్శి వెంకటయ్య, నాయకులు నేనావత్ శంకర్ నాయక్, పరమేశ్, పాండు నాయక్, తావుర్యనాయక్, శంకర్, రాములు, కృష్ణనాయక్, పురుషోత్తం, శ్రీను, దేశ్య, మణిపాల్, హన్మ, రఘు, జయరామ్, రమేశ్, సిమ్రాన్, కుమార్, నరేశ్, నందు, రవీందర్, పాండు, రాజు, నవీన్ తదితరులున్నారు.
మొయినాబాద్ రూరల్ : పదవికి మాత్రమే విరమణ.. సేవకు కాదని సేవాగుణం కలిగి ఉంటే సమాజంలో గుర్తింపు వస్తుందని బాకారం జాగీర్ సర్పంచ్ కొత్తపల్లి రాఘవరెడ్డి అన్నారు. గురువారం ఆయన జన్మదినం, సర్పంచ్ పదవీకాలం ముగియడంతో గ్రామస్తులు ఘనంగా సత్కరించారు. యువజన సంఘాల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.
యాచారం : ఐదేళ్ల పాలనలో శక్తిమేర గ్రామాన్ని అభివృద్ధి చేశామని, తమకు మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి ఎంతో సహకరించి నిధులు కేటాయించారని తాజా మాజీ సర్పంచ్ సబిత అన్నారు. మాజీ సర్పంచ్‌తో పాటు వార్డు సభ్యులను పలువురు గ్రామస్తులు సన్మానించి మెమోంటోలు అందించారు. సబిత మాట్లాడుతూ గ్రామాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు నిధులు అవసరమన్నారు. పాఠశాలలో అదనపు తరగతి గదులు నిర్మించడానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి లత, పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.
కందుకూరు : మండలంలోని నేదునూర్ గ్రామ తాజా మాజీ సర్పంచ్ రామకృష్ణారెడ్డి, ఉపసర్పంచ్ శ్రీనివాస్, వార్డుసభ్యులను గ్రామస్తులు సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ హయాంలో గ్రామాభివృద్ధికి కృషి చేశామన్నారు.



కందుకూరు : నేదునూర్ తాజా మాజీ సర్పంచ్ రామకృష్ణారెడ్డి, పాలకవర్గాన్ని సన్మానిస్తున్న గ్రామస్తులు



యాచారం : తాజా మాజీ సర్పంచ్ సబిత, వార్డు సభ్యులను సన్మానిస్తున్న గ్రామస్తులు

అగ్రికల్చర్ వర్సిటీ భూములు హైకోర్టుకు కేటాయించడం సరికాదు

● ఆల్ ఇండియా స్టూడెంట్ ఫెడరేషన్

శంషాబాద్, ఫిబ్రవరి 2 : అగ్రికల్చర్ యూనివర్సిటీకి చెందిన 100 ఎకరాల భూమిని హైకోర్టు కు కేటాయించడం సరైనది కాదని, తక్షణమే ఆ నిర్ణయాన్ని వెనక్కు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా ముఖ్యకార్యకర్తల సమావేశంలో తీర్మానించారు. ఈమేరకు శంషాబాద్ మున్సిపల్ కేంద్రంలోని ఓ హోటల్‌లో శుక్రవారం ఏఐఎస్ఎఫ్ జిల్లా ముఖ్యకార్యకర్తల సమావేశం నిర్వహించారు. సమావేశంలో జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పి.శివ, గ్యార క్రాంతిలు పాల్గొని మాట్లాడుతూ ప్రభుత్వాలు మారితే యూనివర్సిటీలకు మేలు జరుగుతుందనుకుంటే.. భవిష్యత్ తరాల విద్యార్థులకు పరిశోధనా కేంద్రాలుగా ఉన్న వాటిని అభివృద్ధి చేయకుండా ప్రభుత్వం హైకోర్టుకు కేటాయించడం సరైంది కాదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలన్నారు. యునివర్సిటీ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ నిర్ణయం పరిగణలోకి తీసుకోకుండా ఇదంతా జరిగిందా? లేదా అక్కడ ఉన్న వీసీ, రిజిస్ట్రార్, ప్రొఫెసర్లు స్పందించలేదా? అని ప్రశ్నించారు. నిర్ణయాన్ని వెనక్కితీసుకోకపోతే రాష్ట్రం, కేంద్రంలో వామపక్ష విద్యార్థి, ఇతర ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో శ్రీకాంత్, అజయ్, విజయ్, తేజ తదితరులు పాల్గొన్నారు.

కేశంపేట ఎస్సైగా కుప్పగిరి లింగం బాధ్యతల స్వీకరణ



కేశంపేట, ఫిబ్రవరి 2 : కేశంపేట నూతన ఎస్సైగా కుప్పగిరి లింగం బాధ్యతలు స్వీకరించారు. జనవరి 29న సైబరాబాద్ సీపీ అత్తాపూర్‌లో విధులు నిర్వహిస్తున్న లింగంను కేశంపేట పోలీస్‌స్టేషన్‌కు బదిలీ చేయగా శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ విధులు నిర్వహించిన బీఎస్ఎస్ వరప్రసాద్ కడ్తాల స్టేషన్‌కు బదిలీపై వెళ్లారు.

అభివృద్ధి, సంక్షేమానికి పెద్దపీట



మాట్లాడుతున్న కంజర్ల ప్రకాష్

మొయినాబాద్ రూరల్, ఫిబ్రవరి 2 : కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టిన మధ్యంతర బడ్జెట్‌లో ప్రజాకర్షక పథకాల కంటే అభివృద్ధి, సంక్షేమానికి పెద్దపీట వేసినట్లు బీజేపీ చేవెళ్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కంజర్ల ప్రకాష్ తెలిపారు. శుక్రవారం కంజర్ల ప్రకాష్ మండలంలోని హిమాయత్‌నగర్ చౌరస్తాలోని తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ పదేళ్లలో మోదీ ప్రభుత్వం అనుసరించిన విధానాలతో పేదరికం గణనీయంగా తగ్గిందని వివిధ రంగాల్లో సమగ్రాభివృద్ధి సాధించినట్లు తెలిపారు. తాజా బడ్జెట్ వికసిత్ భారత్ సంకల్ప్ లక్ష్యాలను ప్రతిబింబించడంతో పాటు రాబోయే 25 ఏళ్లలో దేశం సాధించాల్సిన ప్రగతిని నిర్దేశించేలా ఉందన్నారు. ఈ విషయాలను పార్టీ శ్రేణులు క్షేత్రస్థాయిలో ప్రజల్లోకి తీసుకెళ్లి పార్లమెంటు ఎన్నికల్లో చేవెళ్లతో పాటు అన్ని నియోజకవర్గాల్లో బీజేపీ గెలిచేందుకు కృషి చేయాలని సూచించారు.

బురదజల్లే ఆరోపణలు మానుకోండి

● బీఆర్ఎస్‌కు కాంగ్రెస్ నాయకుల హితవు

కొత్తూర్, ఫిబ్రవరి 2 : కాంగ్రెస్ నాయకులపై బీఆర్ఎస్ నాయకులు చేస్తున్న బురదజల్లే ఆరోపణలు మానుకోవాలని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, ఎస్‌బీపల్లి మాజీ సర్పంచ్ అంబటి ప్రభాకర్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు గొంగళ్ల హరినాథ్‌రెడ్డిలు హితవు పలికారు. షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, కాంగ్రెస్ నాయకులు, అధికారులు ప్రొటోకాల్ పాటించడం లేదని జడ్పీటీసీ శ్రీలతసత్యనారాయణ చేసిన ఆరోపణలపై కాంగ్రెస్ నాయకులు స్పందించారు. మండల కేంద్రంలో శుక్రవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రొటోకాల్ పాటించని సంస్కృతి బీఆర్ఎస్‌దే తప్పు.. కాంగ్రెస్‌ది కాదన్నారు. ఎస్‌బీపల్లిలో ఇటీవల రూ.10లక్షలతో నిర్మించనున్న అంగన్‌వాడీ భవనం శంకుస్థాపనకు జడ్పీటీసీతో పాటు, ప్రజాప్రతినిధులకు ప్రొటోకాల్ ప్రకారం సమాచారం అందించని, ఇందుకు తమ వద్ద పూర్తి ఆధారాలున్నాయన్నారు. తాము అందుబాటులోలేమని చెప్పిన బీఆర్ఎస్ నాయకులు.. తప్పుడు కూతలు కూస్తూ, లేనిపోని ఆరోపణలు చేయడం ఎంతవరకు సబబు అని అన్నారు. వీర్లపల్లి ఎమ్మెల్యేగా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి పూర్తిస్థాయిలో పార్టీలకతీతంగా ప్రజాప్రతినిధులను గౌరవిస్తున్నామని, కాంగ్రెస్ నాయకులు, అధికారులను తప్పుదోవ పట్టించేందుకు బీఆర్ఎస్ నాయకులు పనిగా పెట్టుకున్నారన్నారు. ఎస్‌బీపల్లి అభివృద్ధికి రూ.30లక్షల సొంత నిధులతో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని, అభివృద్ధి జరగకుండా జడ్పీటీసీ పలుమార్లు అడ్డుకుందని, తాము కాంగ్రెస్‌కు చెందినందుకు బీఆర్ఎస్ హయాంలో కక్షసాధింపులకు పాల్పడలేదా అని అన్నారు. నాయకులు వీరమోని దేవేందర్‌ముదిరాజ్, రాందాస్‌నాయక్, కక్రొళ్ల సురేందర్, నవీన్‌చారి, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అంబటి ప్రభాకర్, హరినాథ్‌రెడ్డి

మహిళలు అన్నిరంగాల్లో రాణించాలి



సమావేశంలో మాట్లాడుతున్న మంజుల

చేవెళ్ల, ఫిబ్రవరి 2 : మహిళలు అన్నిరంగాల్లో రాణించాలని చేవెళ్ల మహిళా సమాఖ్య మండలాధ్యక్షురాలు వడ్ల మంజుల అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని సీపీఐ కాలనీలో భారత జాతీయ మహిళా సమాఖ్య మండల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ దేశంలో ఎక్కడ చూసినా నిత్యం మహిళలపై దాడులు జరుగుతున్నాయని వాపోయారు. మహిళలు అన్నిరంగాల్లో అభివృద్ధి సాధించే దిశగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గసభ్యుడు రామస్వామి, మండల ప్రధాన కార్యదర్శి సత్తిరెడ్డి, నాయకులు నర్సింలు, యాదగిరి, ఆనందం, లలిత, లత, విజయమ్మ తదితరులు పాల్గొన్నారు.

భారత్ బంద్‌ను జయప్రదం చేయాలి

కందుకూరు, ఫిబ్రవరి 2: కేంద్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలకు నిరసనగా ఈ నెల 16న భారత్‌బంద్ నిర్వహిస్తున్నట్లు రైతుసంఘం జిల్లా అధ్యక్షుడు డి.రాంచందర్ చెప్పారు. శుక్రవారం నేదునూర్‌లో భారత్‌బంద్‌కు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. కేంద్రం విధానాలతో దేశంలో ఆరు కోట్ల పేద కార్మికులు వీధిన పడ్డారని అన్నారు. సీపీఎం నాయకులు యాదయ్య, జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

కల్యాణ్ నాయక్‌కు సన్మానం

ఆమనగల్లు, ఫిబ్రవరి 2 : బీజేపీ గిరిజన మోర్చా రాష్ట్ర అధ్యక్షుడిగా నియమితులై బాధ్యతలు చేపట్టిన డాక్టర్ కల్యాణ్ నాయక్‌ను శుక్రవారం బీజేపీ కల్వకుర్తి నియోజకవర్గ సోషల్ మీడియా కన్వీనర్ రవిరాథోడ్ మర్యాద పూర్వకంగా కలిశారు. హైదరాబాద్‌లోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన ప్రమాణ స్వీకార కార్యక్రమంలో పాల్గొన్నారు. గిరిజన మహిళలతో కలిసి కల్యాణ్ నాయక్‌ను పూలమాలలు, శాలువాలతో సత్కరించి అభినందించారు. అలాగే కల్యాణ్‌నాయక్‌ను జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు తల్లోజు ఆచారి సత్కరించి అభినందించారు. అభిలాష్‌రెడ్డి, శంకర్‌నాయక్, బ్రహ్మచారి, పరమేశ్, సాయిలాల్, మన్యనాయక్, ప్రేమ్, రెడ్యనాయక్, రవినాయక్, తదితరులున్నారు.

జేవీవీ ఆధ్వర్యంలో సైన్స్ టాలెంట్ టెస్ట్

తలకొండపల్లి, ఫిబ్రవరి 2: తలకొండపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం జనవిజ్ఞాన వేదిక జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మండల స్థాయి చెకు ముకి సైన్స్ టాలెంట్ టెస్ట్‌ను నిర్వహించారు. ప్రధానోపాధ్యాయురాలు ఝాన్సీలక్ష్మి పరీక్ష పత్రాన్ని విడుదల చేశారు. జేవీవీ జిల్లా కార్యదర్శి బి.రాములయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన టాలెంట్ టెస్ట్‌లో మండల పరిధిలోని 8 నుంచి 10 తరగతులకు చెందిన 8 పాఠశాలల విద్యార్థిని, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఆంగ్ల మాధ్యమంలో పడకల్ విద్యార్థులు వినయ్‌కుమార్, తేజశ్రీ, ఆనంద్ కుమార్, తెలుగు మాధ్యమంలో వెల్జాల జిల్లా పరిషత్ బాలికల విద్యార్థినీలు స్పందన, స్వాతి, పల్లవిలు ప్రథమ స్థానంలో నిలిచి రేపు తుర్కయంజాల్ లార్డ్స్ హైస్కూల్‌లో నిర్వహించే జిల్లాస్థాయి చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్‌కు ఎంపికయ్యారు.

కడ్తాల ఎస్సైగా వరప్రసాద్



ఎస్సైలు వరప్రసాద్, హరిశంకర్‌గౌడ్‌లను సన్మానిస్తున్న శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు

కడ్తాల్, ఫిబ్రవరి 2: కడ్తాల ఎస్సైగా బీఎస్ఎస్ వరప్రసాద్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేసిన హరిశంకర్‌గౌడ్ సంగారెడ్డి జిల్లాకు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో కేశంపేటలో పనిచేస్తున్న వరప్రసాద్‌కు కడ్తాలలో పోస్టింగ్ ఇచ్చారు. ఏసీపీ రంగస్వామి, సీఐ శివప్రసాద్‌ల సమక్షంలో వరప్రసాద్ బాధ్యతలు స్వీకరించారు. వరప్రసాద్, హరిశంకర్‌గౌడ్‌లను డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్‌రెడ్డి సత్కరించి అభినందించారు. పీఏసీఎస్ డైరెక్టర్ వెంకటేశ్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు బీచ్యనాయక్, మండల కో-ఆప్షన్ సభ్యుడు జహంగీర్‌బాబా, కాంగ్రెస్ జిల్లా నాయకులు గూడూరు భాస్కర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ వేణుగోపాల్, నాయకులు లక్ష్మణ్, రవి, ప్రభు, జగన్ నాయక్, మోహన్ నాయక్, శ్రీను నాయక్, తదితరులు పాల్గొన్నారు. హరిశంకర్ గౌడ్‌కు పోలీసు స్టేషన్‌లో సీఐ శివప్రసాద్, పోలీసు సిబ్బంది వీడ్కోలు సమావేశాన్ని నిర్వహించారు. ఎస్సై వరప్రసాద్, ఏఎస్ఐలు నిరంజన్, ప్రసాద్ జీ, సిబ్బంది ఉన్నారు.

జేపీ దర్గాను దర్శించుకున్న ఎంపీపీ కమ్లీ

కడ్తాల్, ఫిబ్రవరి 2: ఎంపీపీ కమ్లీమోత్యానాయక్ శుక్రవారం కొత్తూరు మండలంలోని జేపీ దర్గాను సందర్శించారు. ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. దైవచింతనతో ముందుకు సాగేవారు ఆనందమయ జీవితాన్ని పొందుతారని, దైవ కార్యక్రమాలు సమాజశాంతికి దోహదపడుతాయని కమ్లీమోత్యానాయక్ అన్నారు. దేపావత్ అనిల్, అశ్విని, విజయ్, లస్కర్, తదితరులు పాల్గొన్నారు.

విధులు సక్రమంగా నిర్వహించాలి

కడ్తాల్, ఫిబ్రవరి 2 : పోలీసు అధికారులు, సిబ్బంది విధులను సక్రమంగా, సమర్థవంతంగా నిర్వహించి ప్రజల మన్ననలు పొందాలని షాద్‌నగర్ ఏసీపీ రంగస్వామి కోరారు. పోలీసు స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాదగా మసులుకుంటూ సమస్యల సత్వర పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. కడ్తాల పోలీసుస్టేషన్‌ను శుక్రవారం ఏసీపీ సందర్శించారు. ఈసందర్భంగా ఆయన స్టేషన్ రికార్డులను పరిశీలించారు. సీఐ శివప్రసాద్, ఎస్ఐ హరిశంకర్‌గౌడ్, సిబ్బందితో సమావేశమై కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు.



రికార్డులను పరిశీలిస్తున్న ఏసీపీ రంగస్వామి

డీసీసీ ఉపాధ్యక్షుడిగా వెంకటేశ్వర్లు గౌడ్



వెంకటేశ్వర్లు గౌడ్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి

ఆమనగల్లు, ఫిబ్రవరి 2: డీసీసీ ఉపాధ్యక్షుడిగా మాడ్గుల మండలం సుద్దపల్లి మాజీ సర్పంచ్ యాచారం వెంకటేశ్వర్లుగౌడ్ నియమితులయ్యారు. ఈ మేరకు హైదరాబాద్‌లోని తన నివాసంలో డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహరెడ్డి శుక్రవారం వెంకటేశ్వర్లు గౌడ్‌కు నియామకపత్రం అందజేశారు. పార్టీ బలోపేతానికి కృషి చేస్తూ రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు ప్రజలందరికీ చేరేలా చొరవ తీసుకోవాలని నర్సింహరెడ్డి ఆయనకు సూచించారు. తనపై ఉంచిన బాధ్యతను సమర్థవంతంగా నిర్వహించి పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని చెప్పారు. తన నియామకానికి సహకరించిన కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, ఏఐసీసీ కార్యదర్శి వంశీచంద్ రెడ్డి, పీసీసీ అధికార ప్రతినిధి బాలాజీసింగ్, పీసీసీ కార్యదర్శి సూదిని రాంరెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు. వెంకటేశ్వర్లుగౌడ్‌ను ఎమ్మెల్యే కసిరెడ్డి సత్కరించి అభినందించారు. హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. మాడ్గుల జడ్పీటీసీ ప్రభాకర్‌రెడ్డి, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు భట్టు కిషన్‌రెడ్డి, నాయకులు కాసాని గోపాల్ రెడ్డి, కొప్పుల శేఖర్‌గౌడ్, సూదిని వెంకటేశ్వర్ రెడ్డి, సురేందర్ రెడ్డి, వెంకట్‌రెడ్డి, బాబా, తదితరులు ఉన్నారు.

ఘనంగా ఆగిరెడ్డి జన్మదిన వేడుకలు



ఆగిరెడ్డికి కేక్ తినిపిస్తున్న భీంభరత్

చేవెళ్ల, ఫిబ్రవరి 2 : కాంగ్రెస్ పార్టీ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి బండారి ఆగిరెడ్డి జన్మదిన వేడుకలు శుక్రవారం చేవెళ్లలో ఘనంగా నిర్వహించారు. ఆయన జన్మదినం సందర్భంగా మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో అంబేడ్కర్ జాతీయ అవార్డు గ్రహీత కడమంచి నారాయణదాస్ విద్యార్థులకు ఉచితంగా పరీక్ష ప్యాడ్లు పంపిణీ చేశారు. అలాగే కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల అసెంబ్లీ నియోజకవర్గం ఇన్‌చార్జి పామెన భీంభరత్ ఆధ్వర్యంలో ఆగిరెడ్డితో కేక్‌కట్ చేయించి నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో చేవెళ్ల తాజా మాజీ సర్పంచ్ బండారు శైలజాఆగిరెడ్డి, నాయకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల 'ఫీల్డ్ విజిట్'



ఆదిభట్ల, ఫిబ్రవరి 2 : విద్యార్థులు కేవలం పాఠ్యపుస్తకాలతో కుస్తీలు పట్టడం కాకుండా తరగతి గది బయట.. సమాజంలో జరుగుతున్న విషయాల పట్ల అవగాహన కలిగి ఉండాలని శ్రీనివాస మోడల్ స్కూల్ చైర్మన్ లక్కరాజు శ్రీనివాసరావు అన్నారు. ఆదిభట్ల మున్సిపాలిటీ కొంగర కలాన్‌కు చెందిన శ్రీనివాస మోడల్ స్కూల్ విద్యార్థులను శుక్రవారం ఫీల్డ్ విజిట్‌కు తీసుకెళ్లి వ్యవసాయంలో భాగంగా వరి, తదితర పంటలు పండే విధానం, రైతులు పడే కష్టాలు చూపించారు. గ్రామంలో కుమ్మరి చెరువు నుంచి మట్టిని తెచ్చి కుండలు చేసే విధానం చూపించారు. ప్లాస్టిక్ వాడటం వల్ల కలిగే అనర్థాలు మట్టి పాత్రలు వినియోగం వల్ల కలిగే ఆరోగ్య పర్యావరణ అనుకూలతలపై అవగాహన కల్పించారు. డైరెక్టర్ రాధిక తదితరులు పాల్గొన్నారు.

డబ్బుతో గెలిస్తే.. అప్రజాస్వామ్య పాలన

● సీనియర్ న్యాయవాది కుమార్ యాదవ్



మొయినాబాద్ రూరల్, ఫిబ్రవరి 2: రాజకీయ నాయకులు ఎన్నికల్లో బోలెడంత డబ్బు ఖర్చు చేసి గెలిచి అధికారంలోకి వచ్చాక పాలన ప్రజాస్వామ్యబద్ధంగా జరుగుతుందన్న నమ్మకం లేదని హైకోర్టు సీనియర్ న్యాయవాది, కాంగ్రెస్ పార్టీ జిల్లా సీనియర్ నాయకుడు, పార్టీ లీగల్‌సెల్ మండ ల్యాక్షుడు బైకని కుమార్ యాదవ్ అభిప్రాయపడ్డారు. శుక్రవారం ఆయన 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ డబ్బు, సంపాదన కోసమే అయితే రాజకీయంగా ఉన్నత పదవుల్లోకి రావాల్సిన అవసరం లేదన్నారు. ప్రస్తుత రాజకీయాలు అందుకు నిదర్శనమని తెలిపారు. ఎన్నికల్లో పోటీ పడినవారు ప్రత్యర్థులుగా కాకుండా శత్రువులుగా మారుతున్నారని విచారం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక నిరుపేదల సంక్షేమానికి సీఎం రేవంత్‌రెడ్డి అధిక ప్రాధాన్యతను ఇస్తున్నట్లు చెప్పారు. కేంద్రబడ్జెట్‌లో జవాబుదారితనం, దార్శనికత లేవని ఆయన విమర్శించారు.

సంక్షిప్తంగా..

● **యాచారం** : మండలంలోని గ్రామాల్లో ఇంటి మీటర్లకు సెల్‌ఫోన్ నెంబర్లను లింక్ చేసుకోవాలని ట్రాన్స్‌కో ఏఈ సందీప్ తెలిపారు. మీటర్లకు సెల్‌ఫోన్ నెంబర్లు లింక్ చేసుకుంటే ఏ నెల ఎంతమేర విద్యుత్ వినియోగించారు. ఎంతమేర బిల్లు చెల్లించాలో సెల్‌ఫోన్‌కు సమాచారమందుతుందన్నారు.
● **మాడ్గుల** : మండలంలోని పెద్ద మాడ్గుల గ్రామ సమీపాన కాకతీయుల కాలం నాటి ఆలయం స్వయంభుశివాలయం అని పురావస్తు శాస్త్రవేత్తలు గుర్తించినట్లు గ్రామస్తులు తెలిపారు. పూర్వకాలంలో అక్కడ స్వామివారి కల్యాణ మహోత్సవాలు వైభవంగా జరిగేవని తెలిపారని గ్రామస్తులు పేర్కొన్నారు. విగ్రహ పునఃప్రతిష్ఠకు రెండేళ్లు పూర్తయిన సందర్భంగా భక్తులు హర్షం వ్యక్తం చేశారు. ఆలయంలో నిత్య పూజలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు.
● **తలకొండపల్లి** : మండల పరిధిలోని జంగారెడ్డిపల్లిలో సీసీ రోడ్డు పనులను మాజీ సర్పంచ్ వరలక్ష్మీ రాజేందర్‌రెడ్డి ప్రారంభించారు. ఎమ్మెల్యే నిధుల నుంచి మంజూరైన రూ.5లక్షలతో నిర్మిస్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా పంచాయతీ పాలకవర్గాన్ని స్థానికులు సత్కరించి అభినందించారు. నాయకులు శ్యామ్‌సుందర్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, చంద్రమౌళి తదితరులున్నారు.
● **ఆమనగల్లు** : ఆమనగల్లు పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాల లో శుక్రవారం స్వపరి పాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పాఠశాల విద్యార్థులు చక్కటి వేషధారణతో ఉపాధ్యాయులుగా తోటి విద్యార్థులకు బోధించిన తీరు చూపరులను ముచ్చట గొలిపింది. సాయంత్రం ప్రధానోపాధ్యాయుడు పాండు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో బోధనలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. టీచర్లు తదితరులున్నారు.
● **ఆమనగల్లు** : దేవరకొండ ఎమ్మెల్యే బాలు నాయక్‌ను శుక్రవారం ఆమనగల్లు పట్టణానికి చెందిన తెలంగాణ రాష్ట్ర పర్యావరణ పరిరక్షణ, బయోడీజిల్ అభివృద్ధి సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు మల్కేడి బన్సీలాల్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈమేరకు హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కలిసి పూలమాలలు, శాలువాలతో సత్కరించి అభినందించారు. పర్యావరణ పరిరక్షణకు సంస్థ ద్వారా చేపడుతున్న కార్యక్రమాలను బాలు నాయక్‌కు ఆయన వివరించారు.